నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఖమ్మం నగరంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ నీరజ

మహనీయుడు జ్యోతిరావు పూలే

మహిళా సాధికారిత ఉద్యమాలకు ఆద్యుడు

అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు

పూలే విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఏప్రిల్ 11 : బడుగు, బలహీన వర్గాల సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని దారపోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కొనియాడారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకొని నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి నామా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా సాధికారిత ఉద్యమాలకు ఆద్యుడని, మహిళల అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవలు చేశారన్నారు. భారతీయ సమాజానికి సైతం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, మహిళలపై జరుగుతున్న సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తన సతీమణి సావిత్రీబాయి పూలేను చదివించడంతోపాటు ఆమెను ఉపాధ్యాయురాలిగా చేశారన్నారు. పాఠశాలను స్థాపించడంతోపాటు మహిళలకు విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. స్త్రీ విముక్తి కోసం ఆయన రాసిన రచనలు, వ్యాసాలు ఎంతో ఉత్తేజపరిచాయన్నారు. కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తాళ్లూరి జీవన్‌కుమార్, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ వలరాజు, ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, చిత్తారు సింహాద్రియాదవ్, మాధవరావు, కోటేశ్వరరావు, ప్రసాద్, పాల్వంచ రాజేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

128 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

- రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరగాలి
- పల్లెల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

ధాన్యం బస్తా కాంటా తీరును పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 11 : జిల్లావ్యాప్తంగా 128 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని, రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గురువారం గుంపెన, నామవరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ గుంపెనలో ధాన్యం తేమ శాతం, గోడౌన్లను పరిశీలించారు. నామవరంలో కాంటాలను ప్రారంభించారు. పంట దిగుబడి ఎలా ఉంది.. కేంద్రాల్లో ధాన్యం అమ్ముతున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నర్సాపురంలో రైతుల కోరిక మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో గన్నీ బ్యాగులు, తేమ పరీక్ష పరికరాలు, తూర్పారబట్టే యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. కౌలు రైతుల జాబితా రూపొందించి ముందస్తుగా టోకెన్లు ఇవ్వాలని, ధాన్యం డబ్బుల చెల్లింపులో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలంలో తాగునీటి పరిస్థితి గురించి ఎంపీడీవో మహాలక్ష్మి, మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణలను అడిగి తెలుసుకున్నారు. రాజాపురంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. తాగునీటి సరఫరా గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సీతారామ ప్రాజెక్టు కాల్వ భూనిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించగా.. వారి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఏవో బాబూరావు, డీఎస్‌వో త్రినాథ్‌బాబు, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో మహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : నగరంలో ముస్లిం సోదరుల ఆతిథ్యాన్ని స్వీకరిస్తున్న ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా, మేయర్

ప్రార్థనలు.. పలకరింపులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- దర్గాలు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల, ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు



గొల్లగూడెం ఈద్గా వద్ద మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎంపీ నామా

సత్తుపల్లి : ముస్లింలను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి టౌన్:రంజాన్ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కొత్తగూడెం అర్బన్ : ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని, జడ్పీ చైర్మన్ కంచర్ల, బీఆర్ఎస్ నేత కోనేరు చిన్ని

పాల్వంచ : ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

నియమ నిష్టలతో నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్‌ను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల 12వ తేదీ నుంచి ప్రారంభించిన రంజాన్ ఉపవాస దీక్షలను బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ముగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రంజాన్ పండుగ కోసం సిద్ధం చేసిన ఈద్గాలు, మసీదుల వద్దకు గురువారం ఉదయమే నూతన వస్త్రాలు ధరించి వెళ్లిన ముస్లింలు భక్తిభావంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ పఠనం చేసి సారాంశాన్ని వివరించగా.. ముస్లింలు శ్రద్ధగా విన్నారు. తర్వాత ముస్లింలు నిరుపేదలకు దాన ధర్మాలు చేశారు. అనంతరం పలువురు రాజకీయ ప్రముఖులు ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ఆలింగనం చేసుకొని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ఈద్గా వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు సూదన్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగరంలో పర్యటించిన ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ పలువురు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, కల్లూరులోని ఈద్గా వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, బీఆర్ఎస్ నేత కోనేరు చిన్ని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఈద్గాల వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. -నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

మణుగూరుటౌన్ : ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా





గొల్లగూడెం ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

ఖమ్మంలోని గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొత్తగూడెం టౌన్ : రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పాల్వంచ : పండుగ విశిష్టతను వివరిస్తున్న ముస్లిం పెద్దలు

కొత్తగూడెం అర్బన్ : రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఓటే ఆయుధం

- భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం
- ప్రతి ఎన్నికలోనూ దాని వినియోగం పౌరుల ప్రధాన కర్తవ్యం
- అందుకు ఓటు హక్కు నమోదు అత్యంత ఆవశ్యం, అనివార్యం
- ఇప్పటికే ఓటు ఉన్నా జాబితాలో పేరుండడమే అంతిమం
- అక్కడ లేకుంటే ఆన్‌లైన్‌లో పొందడం ఇంకా సులభం
- అందుకోసం అధికారిక వెబ్‌సైటే ముఖ్యమైన ఆధారం

సత్తుపల్లి, ఏప్రిల్ 11 : భారత ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. అందుకు ఓటు హక్కు నమోదు చేసుకోవడం, ఎన్నికల్లో దానిని వినియోగించడం.. పౌరుల ప్రధాన కర్తవ్యం. అయితే, ఎంతో విలువైన ఓటును ప్రతి ఎన్నికల్లోనూ వేస్తున్నామని, ఈసారి కూడా జాబితాలో తమ పేరు ఉంటుందిలే అని ఉదాసీనంగా ఉండొద్దు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల తాజా ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఓటుకు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది. ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదో.. తెలుసుకోవాల్సిన బాధ్యత ఓటర్లందరిపైనా ఉంది. జాబితాలో పేరు లేకపోతే తక్షణమే ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. కొత్తగా ఓటరు నమోదుతో సహా మార్పులు, చేర్పులు, సవరణలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియను ఎన్నికల సంఘం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోంది. అదేవిధంగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లోగానీ లేదా బీఎల్‌వో ద్వారా గానీ లేదా తహసీల్దార్ కార్యాలయం ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చు.

అధికారిక వెబ్‌సైట్ ద్వారా..

ఓటు నమోదు, వివరాల పరిశీలన కోసం ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. www.nvsp.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే 'సెర్చ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్' అనే విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై డీటెయిల్స్', 'సెర్చ్ బై ఎపిక్ నంబర్', 'సెర్చ్ బై మొబైల్ నంబర్' అనే ఉప విభాగాలు ఉంటాయి. అందులో 'సెర్చ్ బై మొబైల్ నంబర్' విభాగంలో ఓటరు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని పొందుపరిస్తే ఓటరు వివరాలు కనిపిస్తాయి. మిగతా రెండు విభాగాల్లో ఓటరు పేరు, తండ్రి పేరు, జిల్లా పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబర్ వంటివి ఎంట్రీ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

మొబైల్ యాప్ పని చేస్తుందిలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. యాప్‌లోకి ప్రవేశించాక 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్' విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై బార్‌కోడ్, సెర్చ్ బై క్యూ ఆర్ కోడ్, సెర్చ్ బై డీటెయిల్స్, సెర్చ్ బై ఎపిక్ నంబర్' అనే విభాగాలు కనిపిస్తాయి. మొదటి రెండు విభాగాలకు సంబంధించి ఓటరు గుర్తింపు కార్డుపై ఉన్న బార్ కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. దీని ద్వారా ఓటరు జాబితాలో పేరు ఉందా? లేదా? అనే విషయాలను తెలుసుకోవచ్చు. పేరు, తండ్రి పేరు, వయస్సు, జిల్లా , నియోజకవర్గం తదితర వివరాల ద్వారా యాప్‌లో ఓటరు వివరాలను సరిచూసుకోవచ్చు.

పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా..

https//ceotelangana.nic.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే ఎలక్ట్రోరల్ రోల్స్ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు కనిపిస్తాయి. సంబంధిత నియోజకవర్గం పేరును ఎంచుకుంటే అన్ని పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా పీడీఎఫ్ రూపంలో ఉంటుంది. సదరు ఓటరు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలోకి వస్తాడో చూసుకుని జాబితాలో తన పేరు ఉందో, లేదో పరిశీలించుకోవచ్చు. అందులోనే 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఓటరు లిస్ట్' విభాగం ద్వారా కూడా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు.

ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య ద్వారా..

http//voterportal.eci.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే 'సెర్చ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్' విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య పొందుపరిస్తే.. జాబితాలో మీ పేరు ఉందా? లేదా? పోలింగ్ కేంద్రం పేరు ఏమిటి? సీరియల్ నంబరు ఏమిటి? అనే వివరాలు కనిపిస్తాయి. ఓటరు గుర్తింపు సంఖ్య తెలియకపోతే అడ్వాన్స్ సెర్చ్ విభాగంలోకి వెళ్లి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, జిల్లా, నియోజకవర్గం వంటి వివరాలు పొందుపర్చి వివరాలు తెలుసుకోవచ్చు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఓటర్లు
ఖమ్మం	3,23,091
పాలేరు	2,39,510
మధిర	2,21,370
వైరా	1,92,586
సత్తుపల్లి	2,42,686
కొత్తగూడెం	2,47,669
అశ్వారావుపేట	1,58,223

రిటైర్డ్ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ ట్రస్టీ సమావేశంలో సింగరేణి డైరెక్టర్(పా) శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్(పా) శ్రీనివాస్

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 11 : లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని రిటైర్డ్ ఉద్యోగులు వెంటనే మొబైల్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారా సమర్పించి సీపీఆర్ఎంఎస్ కార్డును రెన్యువల్ చేయించుకోవాలని సింగరేణి డైరెక్టర్(పా), ట్రస్టీల అధ్యక్షుడు ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు సంబంధించి సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2022-23 ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పస్ ఫండ్‌కు రావాల్సిన కంట్రిబ్యూషన్ అమౌంట్ కన్నా తక్కువగా ఉన్నదని, అన్ని ఏరియాల గనులు, డిపార్ట్‌మెంట్లకు తెలిపినా కొందరు మాత్రమే షార్ట్ ఫాల్ అమౌంట్ చెల్లించారని తెలిపారు. ఇంకా 300 మంది చెల్లించలేదని, రెండు నెలల్లో చెల్లించకపోతే వారి మెడికల్ కార్డులు తాత్కాలికంగా బ్లాక్ చేస్తామని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులకు విరమణ రోజే సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ మెడికల్ కార్డు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, జీఎం పర్సనల్ బసవయ్య, కవితానాయుడు, జీఎం ఐటీ రాంకుమార్‌రావు, సురేశ్‌బాబు, సీఎంవో డాక్టర్ సుజాత, కంపెనీ సెక్రటరీ సునీతాదేవి, ఏజీఎం శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

భద్రాద్రిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తిరువీధి సేవకు బయలుదేరిన సీతారామ లక్ష్మణమూర్తులు

భద్రాచలం, ఏప్రిల్ 11 : భద్రాద్రి రామాలయంలో ఉగాది రోజున ప్రారంభమైన వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. అర్చకులు ఉదయం ఉత్సవ పెరుమాళ్లకు ప్రాకార మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ప్రతిరోజూ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపడతారు. ఈ క్రమంలో వేదస్వస్తి, వేదశాస్త్ర ఇతిహాస పురాణాధుల పారాయణం గావించారు. యాగశాలలో చక్రాబ్జ మండల రచన(బియ్యంతో రంగురంగుల చక్రం చిత్రం) చేశారు. అనంతరం యాగశాల మధ్యలో మహా కుంభాన్ని ప్రతిష్ఠించి రామయ్యను ఆవాహన చేశారు. పంచ వింశతి వెండి పాలికలను ఉంచి ఆయా దేవతలను ఆవాహన గావించారు. గురువారం నుంచి బింబం, కుంభం, మండలం, అగ్నితో చతుఃస్థానార్చన చేశారు. సాయంత్రం స్వామివారికి రాజాధి వాహనంపై తిరువీధి సేవ జరిపారు.

నేడు గరుడ ధ్వజ లేఖనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జీయర్ మఠంలో గరుడ ధ్వజ పటాన్ని చిత్రీకరించనున్నారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసిన తర్వాత గరుడ ధ్వజ పటానికి గరుడాది వాసం నిర్వహిస్తారు.